

# డాక్టర్ చెప్పిన కథలు

## – డా.శైలజ చందు



## - పదవ కథ -

సాయంత్రం రౌండ్స్ వేద్దామని వెళ్తున్నాను. ఉదయం చూసినప్పుడు రెండు మూడు కేసులు కొద్దిగా క్రిటికల్ గా ఉన్నాయని అనిపించింది. వాళ్ళను చూసేస్తే మనశ్శాంతి గాఉంటుంది.

వార్డ్ లోపలికెళ్ళబోయే ముందు వరండాలో మలుపు తిరిగబోతుంటే వినపడ్డాయి.

"బోడిముండ. ఏమీ తెలియకుండానే కనేసిందా ఇద్దర్ని. మొదట్లో మా బజార్లోనే ఉండేది. తర్వాత ఇల్లమ్ముకుని పోయారు. బాబు చిన్నప్పుడే పోతే ఈళ్ళమ్మ దీన్ని నర్సింగ్ దాకా ఎట్టా చదివించిందో మా బజార్లో ఎవర్నడిగినా చెప్తారు. ."

గతుక్కుమన్నాను. తెలియకుండానే గుండె వేగంగా కొట్టుకుంది.

ఒక్క రెండు అడుగులేసి మలుపు తిరిగితే ఆ మాట్లాడిన వాళ్ళు కనిపిస్తారు. నేను విన్నట్టు తెలిసిపోతుంది కూడా. అక్కడే ఆగాను. చేతిలో ఉన్న మెడిసిన్ హాండ్ బుక్ తీసి ఒక పేజి చదువుతూ నుంచున్నాను. హఠాత్తుగా వాళ్ళకెదురుపడడం ఇష్టం లేక.

సిగిరెట్ తాగుతున్నట్టున్నారు. నేను కూడా పాసివ్ స్మోకింగ్ చేస్తున్నాను. ఆ రెండు మూడు నిముషాలు ఒక గంట సేపులా అనిపించింది. ఈ సారి మాటలు గట్టిగా కాకుండా మెత్తగా గుసగుస గా వినిపిస్తున్నాయి.

వినకూడని భాష లో చెప్పకూడనివేవో చెప్పుకుంటూ ఉండివుంటారు. ..

నాకేమీ తెలియనట్టు అడుగులేస్తూ మలుపు తిరిగాను. డా. నరేష్ మా వార్డ్ ముందు నుంచున్నాడు ఎవరితోనో మాట్లాడుతూ. మాకు అయిదారేళ్ళ సీనియర్. ఆ హాస్పిటల్ లోనే సర్జన్ లాగా పనిచేస్తున్నాడు. ఏ సర్జరీ అయినా సరే విపరీతమైన స్పీడ్ తో చేస్తాడు. అలా అని కేర్ లెస్ గా కాదు. వంకపెట్టడానికి వీల్లేనంతఅద్భుతంగా చేస్తాడని విన్నాను. .

ఉదయం ఏదో కేసు సర్జరీ వాళ్ళకు రిఫర్ చేశాను. ఎపెండిసైటిస్ అన్న అనుమానంతో .ఆ కేసు చూడడానికి వచ్చి ఉంటాడు.

వార్డ్ లోపలికెళ్ళేసరికి నర్సింగ్ స్టేషన్ లో ఒక్కరూ లేరు. సిస్టర్ అంటూ పిలిచి పక్కకెళ్ళే సరికి నర్సులందరూ ఒక రూం లో గుమి గూడి ఉన్నారు. వరలక్ష్మి మొహం కప్పుకుని ఉంది. ఆమె భుజం మీద చెయ్యివేసి తలోమాటా చెప్తున్నారు.

ఏదో జరిగింది.

" సిస్టర్, రౌండ్స్ కు వెళ్దామా ?" అన్నాను.

అందరూ హడావుడిగా సర్దుకున్నారు.

రౌండ్స్ కు వరలక్ష్మి వస్తే బాగుంటుంది. యాభై మంది పేషంట్లలో ఏ ఒక్క పేషంట్ గురించి అడిగినా, తడుముకోకుండా చెప్పేస్తుంది. అంతే కాదు, వరలక్ష్మి ఏదైనా పేషంట్ గురించి అనుమానం గా చెప్పినా , భయపడినా దాన్ని నిర్లక్ష్యం చేశామో,ఇక వేడి వేడి

పులుసులో ఈత కొట్టినట్టే!

ఓ సారి డా. శారద రౌండ్స్ చేస్తూ చేస్తూ, డెలివరీ అయిపోయిన ఓ పేషంట్ ను తర్వాత రోజు డిశ్చార్జ్ చెయ్యమంది.

వరలక్ష్మి మాత్రం " ఈ పేషంటుని చూస్తే ఐ సి యు లో పెడితే నయమనిపిస్తుంది డాక్టర్" అంది.

"అంతా నీకే అనిపిస్తే , నేనెందుకు రౌండ్స్ కు రావడం. నువ్వు ఛీఫ్ అనుకోవడం మానేస్తే మంచిది వరలక్ష్మీ " శారద చీవాట్లు పెట్టింది.

ఆ తర్వాత అరగంటకే , ఆ పేషంటుకు ఫిట్స్ వచ్చి, అప్పటికప్పుడు ఐ సి యు కు పంపించాల్సివచ్చింది.

నర్స్ వచ్చి, నువ్వు చేస్తున్నది తప్పేమో అని డాక్టర్ని హెచ్చరిస్తే కోపం తెచ్చుకోకూడదట. ఆమెను మన బెస్ట్ ఫ్రెండ్స్ లిస్ట్ లో చేర్చుకోవాలట.... ఎవరో చెప్పారు.

వరలక్ష్మి మన ఇగో దెబ్బతినకుండా, మెత్తగా సూచిస్తూ ఉంటుంది. ఆ హింట్స్ పట్టుకుంటే , డ్యూటీ చాలా వరకు సాఫీగా సాగిపోతుందనే విషయం అనుభవమ్మీద తెలిసింది.

కౌసల్య ఫైల్స్ పట్టుకుని వచ్చింది. వెనక్కి తిరిగి చూస్తుంటే, వరలక్ష్మి కోసమేనని అర్థం చేసుకుని, " అక్కకు తలనొప్పిగా ఉంది మేడం." అంది.

నేనేం అడక్కుండా రౌండ్స్ కానిస్తున్నాను.

చివరికొచ్చేశాము. ఒక పేషంట్ విషయంలో మధ్యాహ్నం వెళ్తూ వెళ్తూ సర్జరీ వాళ్ళను చూడమన్నపేషంట్ కు ఏమైందో కనుక్కుంటే ,

"చూశారు మేడం . అది ఎపెండిసైటిస్ అని ఆపరేషన్ కూడా చేసేశారు. ఇక్కడే ఉంది." అని చూపించింది.

పేషంట్ పరిస్థితి బాగానే ఉంది. రౌండ్స్ ముగించి నర్సులున్న రూంలో కెళ్ళాను. వరలక్ష్మి ఇంజెక్షన్స్ రెడీ చేస్తోంది.

నేను రావడం చూసి మిగతా వాళ్ళు కూడా వచ్చారు.

"ఏమైంది సిస్టర్?" అన్నాను.

ఆమాటకే కళ్ళెర్రబడి , బొటబొటా నీరు కార్చేసింది.

"మేడం, ఎక్కడపడితే అక్కడ ముట్టుకుంటాడు మేడం ఆయన. అదేంటంటే, చాలా అసహ్యంగా మాట్లాడతాడు." అంది సరోజ.

వరలక్ష్మి ఏమ్మాట్లాడకుండా కుమిలిపోతోంది.

ఇలాంటివి వినడం ఇదేం మొదటిసారి కాదు.

" మొన్న ఇందుమతి నైట్ డ్యూటీలో ఉంటే రూము రమ్మన్నాడంట. అదేమంటే , మొగుడు చూడకుండా సైడ్ బిజినెస్ మీకు అలవాటే కదే అంటాడు."

"మర్యాదగా మాట్లాడమంటే వెటకారం చేస్తాడు."

"సత్యవతికి, పిల్లలు పుట్టలేదని దాన్ని ఎవరూ చూడకుండా వాటేసుకుని మీ ఆయన ఇలాంటివేం చెయ్యడం లేదా? నా దగ్గర నేర్చుకుని వాడికీ నేర్పవే అన్నాడంట."

"ఫైల్స్ పట్టుకుని ముందు నడిస్తే వెనక టచ్ చేస్తాడు మేడం. వెనక నడుస్తుంటే గబుక్కున ఆగిపోయి డాష్ ఇచ్చేస్తాడు."

"అదేమని అడక్కూడదు. అడిగామంటే ఆ మాటలు వినలేము."

ఈ సారి విన్నది ఎవరితోనూ కంప్లైంట్ చెయ్యలేనంత ఘోరంగా ఉంది . ఎపెండిసైటిస్ పేషంట్ ను పరీక్ష చేసి చేతులు కడుక్కుని, ఆ చెయ్యి ఎక్కడ తుడుచుకున్నాడో, ఏం చేశాడో చెప్పడానికి సిస్టర్స్ అందరూ నానా అవస్థ పడ్డారు. నొప్పి తట్టుకోలేక అరిస్తే, 'పెళ్ళయి ఇన్నేళ్ళైనా ఇంకా నొప్పేంటే?' అన్నాడట.

కళ్ళ నీళ్ళు పెట్టుకుని 'ఏంటి సార్ ఇదీ ?' అంటే

' నీ రేటెంతో చెప్పు, దానికింత నీలుగుడేంటీ?' అన్నాడట.

'చెప్పు తెగుతుందని' వరలక్ష్మి అరిచినందుకు 'నీకేంటే ఇంత మదం' అని జుట్టుపట్టుకుని గుంజి అవతలకు వెళ్ళిపోయాడట.

చెదిరిపోయిన జుట్టు ఇంకా అలాగే ఉంది. దగ్గరకెళ్ళి, తలమీద చెయ్యివేసి " సారీ వరలక్ష్మీ" అన్నాను. ఆ చెయ్యి అలాగే పట్టుకుని వెక్కి వెక్కి ఏడ్చింది. అవమానం తో మనసుడికిపోతోందేమో, వెక్కిళ్ళు ఆగడం లేదు.

పక్కనే కూర్చున్నాను . కాసేపటికి తేరుకుంది.

" పద వరలక్ష్మీ, సూపరింటెండెంట్ కు చెప్దాము. కావాలంటే నేను తోడొస్తాను. ఇలాంటివి భరించడం ఎందుకు? "అన్నాను.

"అవును మేడం వదలకూడదు." అందరూ అన్నారు కానీ,

"ఈ సంగతి తెలిస్తే ఆయన ఇంట్లో కూర్చోమంటాడు.మళ్ళీ ఒక్క పైసా ఇవ్వడు. నేనూ పిల్లలూ చచ్చిపోతాం మేడం . కంప్లైంట్ వద్దూ, ఏం వద్దూ."

ఆమె భర్త ఆ హాస్పిటల్లోనే లాబ్ లో పని చేస్తుంటాడుట. ఇక్కడ గోల చాలదన్నట్టు, అదనపు బోనస్ గా ఒక అనుమానపు మొగుడు.

మా ఛీఫ్ తో చెప్పాలనుకుని బయటకొచ్చేశాను.

వరండా ఖాళీగా ఉంది. సిగరెట్ పొగ తప్ప ఎవరూ లేరు.

కార్ పార్క్ దగ్గర ఇద్దరం ఎదురుపడ్డాం. ఇద్దరికీ మాట్లాడుకునే పరిచయం లేదు. ఒకే హాస్పిటల్ లో పనిచేసే డాక్టర్లు ఎదురుపడితే పరిచయం లేకపోయినా, 'హలో' అని విష్ చేసుకుంటాము. అతనితో ఆ మర్యాదలు పాటించబుద్ధికాలేదు. అతను కూడా అదేం పట్టనట్టు కారు తీసుకుని వెళ్ళిపోయాడు.

వీలు చూసుకుని ఇలా జరుగుతోందని ఈ విషయం మా ఛీఫ్ తో చెప్పాను. ఆవిడక్కూడా ఈ విషయం కొత్త కాదు. సూపరింటెండెంట్ తో మాట్లాడతానని చెప్పారు.

మా ఛీఫ్ , నేనూ కలిసి, హాస్పిటల్ సూపరింటెండెంట్ ఆఫీసుకు వెళ్ళాము.

" మీరో సారి ఇతని విషయం పట్టించుకోవాలి" అంటూ ఆయనకు వరలక్ష్మి పేరు రాకుండా చెప్పాము.

అంతా జాగ్రత్తగా విని

"చూడమ్మా, పనిచేసే చోట చిన్న చిన్న జోకులు వెయ్యడం, సరదాగా ఉండడం ఇవన్నీ ప్రతి హాస్పిటల్లోనూ కామనే. అతనేదో సరదాగా ఉండి ఉంటాడు. ఈ అమ్మాయిలుకూడా తక్కువ కాదు. బాగానే ప్రవోక్ చేస్తారు. మనం చూసీ చూడనట్టు వదిలెయ్యాలి." అంటూ ఆయన తేలిగ్గా తీసేశారు.

" అయినా నేను చూసుకుంటాగా, మీరీవిషయం మర్చిపొండి ఇంక. " అంటూ భరోసా ఇచ్చారు గానీ, ఆయన ధోరణి చూస్తే, "సమస్య ను తీసుకెళ్ళి జాగ్రత్తగా డస్ట్ బిన్ లో వేస్తాను" అని అన్నట్లనిపించింది.

ఓ రోజు ఉదయం కేసుల హేండోవర్ మీటింగ్ జరుగుతోంది. ఆ టైంలో వార్డులోనూ, డెలివరీ రూం లోనూ సీరియస్ కేసులు ఏమైనా ఉంటే, వాటిగురించి , ఎలా మేనేజ్ చెయ్యాలో డిస్కస్ చేసుకుంటాం. మీటింగ్ మొదలైన ఒక అరగంటకు చంద్రావతి గారినుండి ఫోన్ వచ్చింది.

"కేసుని షిఫ్ట్ చేస్తున్నాను. ఏంబులెన్స్ బయలుదేరింది. పదినిముషాల్లో అక్కడుంటుంది. “ అని

"ఏంటా కేసు?” అని అడిగితే జవాబు చెప్పలేనంత కంగారుగా ఉంది ఆవిడ గొంతు.

మా యూనిట్ లో డా. చంద్రావతిగారు సీనియర్ గైనకాలజిస్ట్. ఆవిడకు బయట స్వంత నర్సింగ్ హోం ఉంది. చంద్రావతి గారి హాస్పిటల్ చాలా అధునాతనం గా ఉంటుంది. సిటీలో ఉన్న వి ఐ పి లందరూ అక్కడికే వెళ్తారు.

మా బ్రాంచ్ లో ‘సీరియస్' అంటే తప్పకుండా బ్లీడింగ్ ఉండే కేసులే ఎక్కువ. అన్నింటికీ రెడీ అయి ఎదురుచూస్తున్నాము. ఎందుకైనా మంచిదని , డ్యూటీలో ఉన్న ఎనస్తీషియా వాళ్ళక్కూడా ఒక మాట చెప్పి ఉంచాము.

ఫోన్ చేసిన పదినిముషాల్లో వచ్చింది ఏంబులెన్స్.

పేషంట్ , పాతిక సంవత్సరాలున్న ఒక యువతి. పెదవులు తెల్లటి రంగులో ..పాలిపోయి ఉన్నాయి. స్పృహ ఉందో లేదో తెలియడం లేదు.

ఇంతకూ కేస్ ఏమిటంటే చంద్రావతి గారు సిజేరియన్ చేశారు. ఆపరేషన్ అయ్యాక పేషంట్ ను రూం కు షిఫ్ట్ చేసిన తర్వాత పేషంట్ బీపీ పడిపోవడంతో ఆందోళనగా షిఫ్ట్ చేశారు

పేషంట్ షాక్ లో ఉంది. ఆమె పొట్ట పరీక్ష చేస్తే, నీళ్ళతో నిండిన బెలూన్ లాగా ఉంది. ఏదో ఒక రక్త నాళం ఓపెన్ అయి, బ్లడ్ లీకవుతున్నట్లు ఉంది. బ్లడ్ తో పొట్ట అంతా నిండి పోయినట్లు తెలుస్తోంది. వెంటనే మళ్ళా ఓపెన్ చేసి, ఎక్కడినుండి రక్తం పోతోందో గమనించి కంట్రోల్ చెయ్యాలి. వెంటనే ఐవి లైన్స్ పెట్టి, బ్లడ్ అరేంజ్ చేసి , థియేటర్ కు తీసుకెళ్ళాం.

ఉదయం చేసిన ఆపరేషన్, మళ్ళీ ఓపెన్ చేసి , చెయ్యాల్సిన పని పూర్తిచేసే సరికి ఒకటిన్నర గంట పట్టింది. నాలుగు యూనిట్స్ బ్లడ్ కూడా ఎక్కించిన తర్వాత పేషంట్ స్టేబుల్ అయింది. బయటకు వచ్చి చూస్తే డా. నరేష్ నిలబడి ఉన్నాడు. వేరే సర్జరీ చెయ్యడానికి వచ్చాడేమోనని, ఏమీ మాట్లాడకుండా వెళుతుంటే

అతనే” డాక్టర్" అంటూ పిలిచి “పేషంట్ ఎలా ఉందని” అడిగాడు.

వివరాలు చెప్పాను. 'కానీ ఇతనికేం సంబంధం. బహుశా తెలిసిన వాళ్ళనుకుంటాను’ అనుకున్నాను గానీ,

బయట కొచ్చాక మా ఛీఫ్ చెప్పింది. ఆ పేషంట్ అతని చెల్లెలేనట .

రక్తం అంతా పోవడం, రెండో సారి ఆపరేషన్ ,తర్వాత ఆమె చాలారోజుల పాటు హాస్పిటల్ లోనే ఉండాల్సి వచ్చింది. ఇన్ఫెక్షన్ సోకడం___. ఎప్పటికప్పుడు బీపీ పడిపోవడంఒకటి కాదు, పేషంట్ కు ఎన్నో కాంప్లికేషన్స్ తలెత్తాయి. ఒక రోజు బాగానే ఉంది అనుకుంటే ఆ సాయంత్రానికి సిక్ అయేది.

ఆమెకు తల్లిదండ్రులు లేరు. అన్న డా. నరేష్ ఒక్కడే. భర్త అమెరికాలో ఉన్నాడు. రావడానికి కనీసం ఓ వారం పడుతుందట. అతని తలిదండ్రులిద్దరికీ, పెద్దవయసు. మిగతా బంధువులెవరూ వచ్చే పరిస్థితిలో లేరు.

పేషంట్ నూ, బిడ్డనూ చూసుకునేందుకెవరూ లేరు. డా. నరేష్ కు పెళ్ళి అయింది కానీ, భార్య వెళ్ళిపోయిందన్నారు. వార్డ్ లో ఉయ్యాల్లో ఏడుస్తూ ఉంటే నర్సులే పాలుపట్టే వారు. మొదట్లోఅతని పట్ల ఉండే కోపం వల్ల నిరాసక్తంగా చేసినా, రాను రానూ అందరూ బిడ్డకు ఎటాచ్ అయ్యారు. పగలంతా, ఎక్కువగా వరలక్ష్మి చూసుకునేది. వారం తర్వాత భర్త వచ్చాడు కానీ, బిడ్డను అతనికి ఒప్పజెప్పే ధైర్యం చెయ్యలేకపోయారు. దాదాపు నెలరోజులయ్యాక కోలుకుంది.

ఆమె డిశ్చార్జ్ అయి వెళ్ళిపోయే రోజున అందరూ బాబుని ఎత్తుకుని ముద్దు చేశారు. ఇంటి దగ్గర ఆ అమ్మాయిని, బిడ్డను చూసుకోవడానికి ఇద్దరు కేర్ టేకర్స్ ను పెట్టారట. ఆ అమ్మాయి నర్సులందరి దగ్గరా సెలవు తీసుకుంటూ, చేతులుజోడించి కన్నీళ్ళు పెట్టుకుంది. నర్సులందరూ కూడా చాలా ఇమోషనల్ అయిపోయారు. వరలక్ష్మి బాబును ఆమె చేతికందించి "బాబుకోసం జుబ్బాలు అంటూ" ఆమెకో పాకెట్ ఇచ్చింది. ఆమె వద్దనకుండా సంతోషంగా తీసుకుని

"వరలక్ష్మీ, ఓ సారి మీరంతా ఇంటికి రండి. నన్ను చూడడానికి" అంది.

ఆ రోజు టిప్ రూపం లో డబ్బులివ్వబోతే వరలక్ష్మి వద్దంది.

ఆ అమ్మాయి "తీసుకో అక్కా, నాకోసం తీసుకో" అని బతిమలాడినా సరే వద్దంది.

ఆ అమ్మాయి డా. నరేష్ దగ్గరకెళ్ళి, " అన్నయ్యా, తీసుకోవడం లేదు. నువ్వు చెప్పు" అంది.

" చాలదేమో. ఎంత కావాలో కనుక్కో" అన్నాడు.

మాట్లాడకుండా లోపలికెళ్ళిపోయింది.

ఆమె డిశ్చార్జ్ అయిన మూడు వారాలకు ,

ఓ రోజు, సాయంత్రం, అందరం ఖాళీగా ఉన్నాము. కేసులేమీ లేవని, అందరికీ బజ్జీలు తెప్పించారు చీఫ్. వరలక్ష్మి టీ తయారు చేసి తీసుకొచ్చింది. ఏవో నవ్వుల్లో మునిగి ఉన్నాము.

బయట పెద్ద సౌండ్ తో లాంగ్ బెల్ మోగింది. ఏదైనా మరీ ఎమర్జెన్సీ వచ్చినపుడు హాస్పిటల్ బయట గేట్ దగ్గర పెద్ద సౌండ్ తో బెల్ మోగుతుంది. హాస్పిటల్ లో అందరూ ఎలర్ట్ కావడానికి వీలుగా. అలాంటి బెల్ ఎక్కువగా ఏక్సిడెంట్ కేసుల్లోఇద్దరు ముగ్గురు సీరియస్ గా ప్రాణాపాయ స్థితిలో ఉంటే మోగుతుంది. అయినా సరే ఎమర్జెన్సీ లో ఎక్కువమంది స్టాఫ్ అవసరమౌతారని తలా ఒక పనిచెయ్యడానికి ఆక్సిడెంట్ అండ్ ఎమర్జెన్సీ వైపువెళ్ళబోతుంటే, ఆంబులెన్స్ నుండి ట్రాలీ మా వైపే వస్తోంది. వెనకే డా. నరేష్ పరుగుతో వస్తున్నాడు.

అతని చెల్లెలు, మళ్ళీ రక్తస్రావంతో వచ్చింది. ఇంట్లో ఏదో పనిచేస్తూ ఉండగా బ్లీడింగ్ మొదలైందట. డా. నరేష్ ఏంబులెన్స్ ని పిలిపించి తీసుకొచ్చారు. ట్రాలీలోంచి రక్తం ధారగా కారిపోతూ, వరండా అంతా చిమ్మినట్లయి చూసేందుకు, భయంకరంగా ఉంది.

అందరిలోనూ తెలియని భయం, వణుకు...

ఆమె ఊపిరితీసుకోవడం కోసం ఆయాసపడుతోంది. ఆమె కళ్ళలో ఆతృత. చావుకు దగ్గరవుతున్నానన్న కంగారు కనిపిస్తోంది. సెలైన్ పెట్టడానికి ప్రయత్నిస్తుంటే నరాలు చిక్కడం లేదు. ఆక్సిజెన్ మాస్క్ పెట్టాము. హాస్పిటల్ లో ఉన్న ప్రతి డాక్టర్ నిముషాల్లో అక్కడకు చేరుకున్నారు. మేము, ఐసియు డాక్టర్లు , అందరం చెయ్యాల్సింది చేశాము. మా వంక చూసి ఏదో చెప్పబోతూ, చెప్పడానికి ఊపిరందక, కళ్ళతోనే ఏదో చెప్తు చెప్తూ ... ఆమె చివరి శ్వాస తీసుకుంది.

ఆతృత కలిసిన ఆ చూపు మా మీదే నిలిపింది. అది తట్టుకోలేక ఆమె రెప్పలు మూసేశాము.

మా ఛీఫ్ అందరికన్నా ముందు తేరుకుంది. ఆ తర్వాత జరగాల్సిన ఏర్పాట్లు చూసేందుకు ఆమె బయటకు వెళ్ళారు. అంతా కుదుట పడిందని, రెండు రోజుల ముందే ఆమె భర్త అమెరికా వెళ్ళిపోయాడట. మాటల మధ్యలో ఏం తెలిసిందంటే కంగారులో పేషంట్ నిమాత్రమే తీసుకొచ్చారు కానీ, బాబు సంగతి మర్చిపోయారు. నర్సులిద్దరు వెళ్ళి బాబుని తీసుకొచ్చారు. ఆమె చనిపోయిన మూడోరోజున భర్త వచ్చాడు . పదవరోజు తర్వాత వెళ్తూ, తన చెల్లెలితో కలసి వచ్చి బాబును తీసుకెళ్తానని చెప్పి వెళ్ళాడు.

బాబు వీసా కోసం , అవసరమైన ఫార్మాలిటీస్ పూర్తికావడానికి ఒకటిన్నర నెల పట్టింది. ఇంటిదగ్గర ఆడవాళ్ళు లేరు. ఆడవాళ్ళు లేని ఇంట్లో పనిచెయ్యమని కేర్ టేకర్లు మానేశారట. తప్పని సరిపరిస్థితుల్లో హాస్పిటల్ లోనే ఉంచారు. ఆ టైం లో బాబు సంరక్షణ అంతా వరలక్ష్మి చూసుకుంది. బాబుని తీసుకెళ్ళేరోజున డా. నరేష్, బాబు తండ్రి వచ్చారు.

నర్సులు చేసిన సహాయానికి కృతజ్ఞతలు చెప్పుకున్నాడాయన.

"ఇన్ని రోజులు మీరు చేసిన సర్వీస్ కు వెలకడుతున్నానని అనుకోకపోతే" అంటూ బాబుని చూసుకున్న నర్సులకు, ఆయాలకు డబ్బులిచ్చారు. అందరూ తీసుకుని లోపలికెళ్ళిన తర్వాత, వరలక్ష్మి బాబుని తండ్రి కప్పగించింది. ఆమెక్కూడా ఇవ్వబోతే వద్దని చెప్పింది. బాబు తండ్రి చెప్పినా, మా ఛీఫ్ చెప్పినా వరలక్ష్మి ఒప్పుకోలేదు.

" తీసుకోమనండి మేడం" అంటూ డా. నరేష్ వచ్చి ఏదో చెప్పబోతే మా చీఫ్,

" తనకు కావల్సింది డబ్బు కాదు నరేష్. కొద్దిగా గౌరవం. అది గుర్తిస్తే చాలు." అంటూ భుజం తట్టారు.

Post your comments